18

# ఎదురు తిరిగిన మోసం

ఒక వూరిలో శ్రీరంగనాయకులు అనే వడ్డీ వ్యాపారి ఉండేవాడు.

ఆ వ్యాపారంలో ఆయన లక్షలు గడించాడు. ఆ రోజుల్లో వెయ్యి రూపాయల నోట్లు చలామణిలో ఉండేవి. తాను నిల్వ ఉంచుకున్న సొమ్మును ఈ పెద్ద నోట్లుగా మార్చి వాటిని కట్టలు కట్టి, ఆ కట్టలను రోజూ చూసుకుంటూ సంతోషించేవాడు. శ్రీరంగనాయకులు దగ్గర వేలు, లక్షలు ఉన్నా ఆ డబ్బును బ్యాంకులో వేసేవాడు కాదు ఆయన. ఎందుకంటే... బ్యాంకులు దివాళా తీస్తాయేమోనని భయం!

ఒకసారి శ్రీరంగనాయకులు వ్యాపార నిమిత్తం మలయా వెళ్లాడు. అక్కడే మూడునెలలు ఉండిపోవలసి వచ్చింది.

ఈ సమయంలో ఇండియా ప్రభుత్వం అధిక నోట్ల చలామణిని అరికట్టే ఉద్దేశంతో అకస్మాత్తుగా 1000 రూపాయల నోట్లను రద్దు చేసింది. ఫలానా తేదీలలో బ్యాంకులో వాటిని మార్చుకోవచ్చని ప్రకటించింది.

రంగనాయకులు ఇండియాకు తిరిగి వచ్చేసరికి ప్రభుత్వం ఇచ్చిన గడువు కూడా ముగిసింది. సంగతి తెలుసుకొని లబోదిబోమని తల బాదుకుని విలపించాడు. కారణం... సుమారుగా లక్షరూపాయల రొక్కం పెద్దనోట్ల రూపంలో ఆయన దగ్గర ఉండిపోయింది.

ఇంతలో... రంగనాయకులు బుర్రలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

తను, తన కుటుంబ సభ్యులు ఆపద మొక్కుల రూపంలో కొన్ని వేల రూపాయలు 'తిరుపతి వేంకటేశ్వరస్వామి' కి చెల్లించవలసి ఉంది. అయినా– డబ్బును దేముడికి వెయ్యడానికి కూడా మనసు రాక ఆ మొక్కును చాలాకాలం నుంచి తీర్చకుండా ఉన్నాడు. ఇప్పుడు ఈ నోట్లన్నీ తీసుకెళ్లి తిరుపతి హుండీలో వేసేస్తే తన మొక్కులు తీరుతాయి.



అలా వచ్చిన నష్టాన్ని కొంత భర్తీ చేసుకోవచ్చుననుకున్నాడు.

అనుకున్నదే తడవుగా సకుటుంబ సమేతంగా తిరుపతి వెళ్ళి తన దగ్గరున్న 1000 రూపాయల నోట్లనన్నిటినీ దేవుని హుండీలో వేసి తిరిగివచ్చాడు.

అదేరోజు పత్రికలలో ఒక ప్రభుత్వ ప్రకటన ప్రముఖంగా ప్రచురితమయింది. దానిని చూస్తూనే నోట మాటరాక కూలబడిపోయాడు శ్రీరంగనాయకులు. ప్రజల విపత్తులను పరిశీలించి పెద్దనోట్లను మార్చుకునే గడువు మరో నెల రోజులు పెంచినట్లు ఆ ప్రభుత్వ ప్రకటనలో ఉంది.

"అయ్యో... వడ్డీ కాసులవాడినే మోసం చెయ్యబోయి నేనే తిరుక్షవరమయ్యానురా దేవుడా!" అని మనసులోనే కుమిలిపోయాడు శ్రీరంగనాయకులు.